పి.వి.ఆర్ శివకుమార్



శుభ ముహూర్తం సమీపిస్తోంది.

"పెళ్లి కూతుర్ని పీటలమీదకి తీసుకు రండమ్మా" అన్నాడు పురోహితుడు. 'పెళ్లి కూతురు... పెళ్లికూతురు...' క్షణాలమీద ఆ మాట లోపలికి పాకిపోయింది. సౌశీల్యని మెల్లమెదిగా లేపి నిలబెట్టింది ఆమె అక్క. అక్కవైపొకసారి తలెత్తి చూసి, మళ్లీ తల దించుకుంది సౌశీల్య.

'ఎంత సిగ్గో!' అనుకుంది ఆమె అక్క. చిన్నగా నవ్వుకుని, చెల్లెలి పక్కనే నడవ సాగింది.

"నాకేం అభ్యంతరంలేదు; ఎత్తుకు వెళ్లమంటే, అలాగే ఎత్తుకు తీసుకెళ్తాను." గట్టిగానవ్వుతూ అన్నాడు సౌశీల్య మేనమామ.

అతను ఓ బుట్ట పట్టుకుని, సౌశీల్య రెండో వైపున నడుస్తున్నాడు.

'అఖ్కర్లేదు' గొణిగింది సౌశీల్య మనసులో చిన్నగా నవ్వుకుంది!

'తనకి సిగ్గనుకుంటున్నారు వీళ్ళు. తన మనసులో నడుస్తున్న వ్యవహారం వీళ్లకేం తెలుసు?'

పెళ్లికొడుకు 'తెరవెనక' వున్నాడు. పురోహితుడు చెప్పినట్టు చేస్తున్నాడు. ఆసక్తిగా పెళ్లికూతురు కోసం ఎదురు చూస్తున్నాడు.

ద్విజమౌళికి పెళ్లికూతురు బాగానచ్చింది. పెళ్లి చూపుల్లోనే ఆమెని ప్రేమించేశాడు! 'ఈ అమ్మాయి తనకి అర్ధాంగి అయితే ఎంత బావుంటుందో' అని అక్కడికక్కడే అనుకున్నాడు.

అయ్యే ఘడియలు సమీపించాయి. సౌశీల్య అందం ద్విజమౌళికి నచ్చినట్టే, ఆమె తండ్రి ఇవ్వచూపిన కట్నం ద్విజమౌళి తల్లికీ, మేన మామకీ నచ్చాయి. సంబంధం తక్కువ కుదిరి పోయింది. ముహూర్తమూ చప్పునేకుదిరింది. ద్విజమౌళీ, సౌశీల్యల పెళ్లి రోజుల్లోంచి గంటల్లోకి, అర్ధగంట దూరానికి వచ్చేసింది.

సౌశీల్య పీటమీద కూర్చుంటూ చుట్టు పక్కలకి వోసారి చూసింది. తన స్నేహితురాళ్లు అంజలి, శాంతి, అజంత, తదితరులూ అంతా కొద్ది అడుగుల దూరంలోనే కూర్చుని వున్నారు. అజంత కళ్లతోనే సౌశీల్యని అభినందిస్తూ టెలిగ్రాం పంపింది. సౌశీల్య కూడా కళ్లు రెపరెప లాడుస్తూ జవాబిచ్చింది. పీట మీద కూర్చుంది.

పురోహితుడు హడావిడిగా తర్వాతితతంగం ప్రారంభించాడు.

పావుగంటసేపు మంత్రాలు పందిరినిండా దొర్లాయి, చుట్టూ వుంచిన మైక్‌ల ద్వారా.

"అయ్యా, తొమ్మిదీ ఏడు నిముషాలవుతోంది" హెచ్చరించాడు పందిరి దగ్గరగా ముందు వరస కుర్చీల్లో కూర్చున్న ద్విజమౌళి మేనమామ.

"వస్తున్నానండి! చూస్తున్నాను. ఆ:... భజంత్రీలూ...కాస్త గట్టిగా వాయించండి... జీలకర్ర, బెల్లం... నాయనా, యిదిగో, యీ జీలకర్ర బెల్లం... యిలా, తెరమించి... అమ్మాయి తలమీద వుంచు. అమ్మా, యిదిగో... యీ..."

"ఆగండి" మోగుతున్న బాజాలకన్నా గట్టిగా అరిచింది అప్పటికే లేచి నిలబడ్డ అజంత.

ఆ అరుపు వినపడటంతోనే లేచి నిలబడి పోయింది సౌశీల్య.

ఊహించని యీ సంఘటనకి పందిట్లో వాళ్లంతా విస్తుపోయారు. బాజాలు ఆగి పోయాయి— ఎవరో ఆపమంటూ సైగ చేశారు.

క్షణాలమీద అంతా పెళ్లి మంటపం దగ్గరగా మూగారు.

"ఏమయింది? ఎవర్నువ్వు? ఎందుకు అలా అరిచావు?" అడిగాడు ద్విజమౌళి మేనమామ, అచ్యుతం.

"ఏమిటే? ఎందుకు అలా లేచినిలబడ్డావ్? ఎందుకు ఆగమంది నీ స్నేహితురాలు?"

కంగారూ, కోపం కలగా పులగం కాగా అరిచినట్టే అడిగాడు సౌశీల్య తండ్రి భరద్వాజ.

సమాధానం చెప్పకుండా అజంత వైపు చూసింది సౌశీల్య. అజంత ముందుకు వచ్చింది.

"దానికేం తెల్సు బాబాయ్, నన్నడగండి నే చెప్తాను. నే నీ పెళ్ళికి రావటం చాలా మంచిదయింది. తాళికట్టక ముందే, జీలకర్ర బెల్లమైనా పెట్టకముందే పెళ్ళికొడుకుగార్ని చూడటం మరీ మంచి దయింది..."

"ఏమిటా సోది ? అసలు సంగతి చెప్పక?" అసహనంగా అన్నాడు భరద్వాజ.

"ఈ పెళ్ళికొడుకు ... మన సౌశీల్యకి తగడు. ఇతని కారెక్టర్ మంచిది కాదు."

ఊపిరి పీల్చుకుంటూ ఆగింది అజంత.

ద్విజమౌళి మొహంలో రక్తమంతా కాళ్ల లోకి దిగిపోయి నట్లయింది. తెల్లగా పాలి పోయిన మొహంతో ఆమెకేసి చూశాడు.

'ఎవరీ అమ్మాయి ? ఎందుకింత పెద్ద నింద వేస్తోంది తన మీద ?'

"ఏమిటమ్మాయ్ ఆ వాగుడు? ఎవర్నువ్వు? మా వాడి గురించి చెడుగా వాగే హక్కు నీ కెవరిచ్చారు ?" రౌద్రంగా అడిగాడు అచ్యుతం.

"మీరు వుండండి అన్నగారూ, అది మా అమ్మాయి క్లాసుమేటు, దాని మాటల్ని మీరు లక్ష్యపెట్టక్కర్లేదు. ఇదిగో అజంతా నువ్వు ముందు వెనక్కి నడువ్.

అమ్మాయ్ సౌశీల్యా, కూర్చో. అల్లుడు గారూ, మీరూ కూర్చోండి. ఈ అనుకోని సంఘటనకి మమ్మల్ని క్షమించండి" అప్పటికే లేచి నిలబడ్డ ద్విజమౌళి భుజం మీద అనునయంగా చెయ్యివేస్తూ అన్నాడు భరద్వాజ.

"ఆగండి నాన్నా ! అజంత ఏం చెప్ప దల్చుకుందో చెప్పనివ్వండి."

ఖంగున మోగింది సౌశీల్యకంఠం. ఉలిక్కి పడి చూశాడు భరద్వాజ— కూతురి వైపు.

"అవును. అతని గురించి నా స్నేహితురాలిగా అది ఏదో చెప్పబోతుంటే మీరెందుకు దాని నోరు నొక్కుతారు ?"

"నీకేమైనా మతి పోయిందిటే, పీటల మీద జరుగుతున్న పెళ్ళి ఆపుతావా అంత దాకా ?" భరద్వాజ మాటలు పూర్తి కాకుండానే, ద్విజమౌళి ముందుకొచ్చాడు.

"మీరు ఆగండి. ఆ అమ్మాయి ఏం చెప్ప దల్చుకుందో చెప్పనీయండి" పౌరుషంగా అన్నాడు, "నా గురించి ఆమెకి ఏం తెలుసో, ఎందుకు నా కారెక్టర్ మంచిది కాదని అన్నదో చెప్పనివ్వండి."

"వివరంగా చెప్పమంటారా ?" వ్యంగ్యంగా అడిగింది అజంత. "మీరు పెంకిపాడు బిజెన్స్ కాలేజీలోనే కదూ చదివారు ?"

"అవును. అయితే ?"

"మీకు నేను గుర్తుండి వుండన్లేండి. నేను మీకన్నా రెండేళ్లు జూనియర్ని. ఇంటర్ అక్కడే చదివాను.

మీరు సెకండియర్లో వుండగా ఎన్నివేషాలు వేశారో, ఫైనలియర్ చివర్లో ఏం జరిగిందో అన్నీ నాకు తెల్సు. ఇంకా వివరాలు కావాలని మీరు అడిగినా, నేను వివరించేటంత సిగ్గు మాలినదాన్ని కాను. కానీ, ఆ అమ్మాయిలు ముగ్గురూ మాత్రం నాకు తెల్సు."

అజంత మాటలు వింటున్న ద్విజమౌళికి మతి పోతున్నట్లయింది.

'పెళ్ళి పీటల మీద యింత అవమానం ! తను కాలేజీలో వుండగా కాస్త చిలిపిగానూ, దుడుకుగానూ ప్రవర్తించిన మాట నిజం. ఏదో స్నేహితుల ప్రోద్బలంతో కాస్త విర్చుంభించి అల్లరిచేసేవాడు. అంతకు మించి ఏ అమ్మాయినీ మోసం చేసి ఎరగడు. మరి ంగామె ఎందుకిలా తనమీద విరుచుకు పడుతోంది?"

ద్విజమౌళి ఆలోచనల్లో నోరు మెదపక పోయేసరికి తను నోరు విప్పింది సౌశీల్య.


"నేనతణ్ణి చేసుకోను నాన్నా. నాకీ పెళ్ళి వద్దు. దయచేసి పెళ్ళి ఆపెయ్యండి" అంది తండ్రికేసి చూస్తూ.

"నోర్మూయ్. పిచ్చి వాగుడు వాగకు. పీటలమీది పెళ్ళి చెడగొట్టుకుంటావా చేజేతులా? నీకేం పిచ్చిపట్టిందేమిటి? దాని మాటలు విని వెర్రివెర్రి ఆలోచనలు చెయ్యబోకు." గదిమాడు భరద్వాజ.

"అవునమ్మా, మావాడు అలాటివాడు కాదు. నీ స్నేహితురాలి మాటలు నమ్మి నీ పెళ్ళి చెడగొట్టుకోకు. మాదేముంది— కో అంటే కోటి సంబంధాలొస్తాయ్ రేపేపాటికి! నీ బతుకే అన్యాయ మవుతుంది, ఈ పెళ్ళి చెడగొట్టుకున్నావని నలుగురికీ తెలిస్తే" బెదిరింపు ధోరణిలో అన్నాడు అచ్యుతం,

'దరిద్రపు వెధవ— నిజంగా కాలేజీలో ఏ వెధవ పని చేశాడో? ఈసంగతి బంధువులందరికీతెలిసి పెళ్లికూతురు వీడిని కాదందని అంతా కథలు కథలుగా చెప్పకుంటే పరువు ఏమయిపోతుంది? అంతదాకా రానియ్యకూడదు' అని మనసులో అనుకుంటూ.

"పెద్దవాళ్లం— నీ మంచే కోరేవాళ్లం. మా మాట విను తల్లీ, నీకేం భయం లేదు.



## చిట్కాలు

★ తెల్ల ఉల్లిరసములో సైంధవలవణము కలిపి తాగినట్లయితే కడుపునొప్పి తగ్గుతుంది.

★ లవంగాలు నూరి నొసటిపైన పూసినచో తలనొప్పి తగ్గుతుంది.

★ ఉల్లిపాయలు తిన్న తరువాత ఒకచిన్న యాలకుపండును లేదా ఎండు ధనియాలు నమిలినచో ఉల్లిపాయ వాసన పోతుంది.

★ భోజనానంతరము మజ్జిగలో సైంధవ లవణము మరియు వేడ్చిన జీలకర్ర వేసి త్రాగిన శరీరము బలపడును

★ లవంగాలు నోటిలో వుంచి చప్పరించిన ఎడల కఫము బయటికి వచ్చును

★ దెబ్బ తగిలినప్పుడు ఒక చిన్న గరిటెడు పసుపు గుండ పాలలోకలిపి త్రాగినచో దెబ్బ యొక్క నొప్పి తగ్గుతుంది.

★ నూనెలో తెల్లుల్లి రెక్కలు వేసి బాగుగా మరుగనిచ్చి ఆ నూనెను చెవిలో వేసినట్లయితే చెవిలో కురుపులు, చెవిలో నొప్పి తగ్గుతుంది

★ కోడిగుడ్డులోని నీరు వంటి ద్రవముతో తల రుద్దుకొనినయెడల శిరోజాలు అతిశుభ్రముగా, నల్లగా, పెరుగును. ఈ పని వారంకి ఒకసారి మాత్రమే చేయవలెను.

★ పులిహోర తిన్నాక కడుపు ఉబ్బరంగా ఉంటే, గోరువెచ్చటి నీళ్ళు త్రాగితే తేలికగా ఉంటుంది.

★ అలారం మోత సరిగా వినబడాలంటే డబ్బారేకుమీద గడియారం పెట్టాలి

- సేకరణ : డి. సత్యం

## హక్కు

చెప్పుడు మాటలు విని తప్పుడు ఆలోచన్లు చెయ్యకు... కూర్చో...'' అప్పటిదాకా వెనక నిలబడిపోయిన సౌశీల్య తల్లి ముందుకు వచ్చి అజంతకేసి చురచుర చూస్తూ అంది.

"చూడు సౌశీల్యా, ఒక్కటే మాట అడుగుతున్నాను—ఈ పెళ్లి జరగనిస్తావా? ఆపేస్తావా?''

సిగ్గువిడిచి ఒకడుగు ముందుకి వేసి అడిగాడు ద్విజమౌళి సీరియస్‌గా.

"మరి నా స్నేహితురాలి మాటకి మీ సంజాయిషీ ఏమిటి?'' తలెత్తి అడిగింది సౌశీల్య.

"ఆమె అలా ఎందుకు చెప్తోందో నాకు తెలీదు. కానీ, నేను నీకిచ్చే సలహా ఒకటే— ఎవరో ఏదో చెప్పారని, నిజం తెల్సుకోకుండా జీవితంలో అతి ముఖ్యమైన పెళ్లిని చెడగొట్టుకోకు!''

"అయితే పెళ్లి జరగాలంటారు?''ఓరగా చూస్తూ అడిగింది సౌశీల్య.

"అది నా సలహా. తర్వాత నీ యిష్టం.''

"సరే- చెప్పుడు మాటలు విని, నిజానిజాలు తెల్సుకోకుండా ప్రవర్తించకూడదని మీరు అంటున్నారు గనుక యిప్పుడు పెళ్లి జరగడానికి నేను ఒప్పుకుంటున్నాను. అయితే— ఈ పీటమీద కూర్చోవలసింది నేను మాత్రం కాదు—'' సగంలో ఆగి, వెనక్కి తిరిగింది సౌశీల్య.

అప్పటికే లోపలికి వెళ్ళిన అజంతతోపాటు నడిచివస్తున్న అమ్మాయి సౌశీల్య కంట పడింది.

"అదిగో— ఆ అమ్మాయి చూడండి— ప్రేమ! ఒకప్పుడు మీతో పెళ్లికుదిరి, ఆ తర్వాత ముహూర్తాలు కూడా కుదిరాక, ఆమె నడత మంచిది కాదని మీకు వచ్చిన ఒకే ఒక్క ఉత్తరాన్ని ఆధారం చేసుకుని మీరు సంబంధం కాదనేశారే — ఆ ప్రేమ! గత ఏడాది గానూ ఏ సంబంధమూ, మీరు వేసిన నెపం కారణంగా, కుదరక, తల్లిదండ్రుల చీదరింపులక్కూడా గురై ఏడుస్తూ బతుకుతోంది !''

తల తిప్పి అటు చూసిన ద్విజమౌళి ప్రేమ కనిపించేసరికి గతుక్కుమని అవాక్కై నిలబడ్డాడు.

ద్విజమౌళి తల్లి, మేనమామ కూడా ప్రేమ వైపు చూసి ఉలిక్కిపడ్డారు !

'ఈ పిల్ల యిక్కడెందుకుంది ? సౌశీల్యకి యీ పిల్ల స్నేహితురాలా ?

"ప్రేమించానంటూ వెంటబడి వెర్రిమొర్రి వేషాలు వేసిన ఓ క్లాస్‌మేట్‌ని తను కాదందని, తన మీద పగబట్టి, కుదిరిన మీ సంబంధం చెడగొట్టాలని వాడు మీకు ఆకాశరామన్న లేఖ రాశాడు ! అది మీరు గుడ్డిగా నమ్మి, ముహూర్తాలు కుదిరిన పెళ్లిని ఆపేశారు !

ఏం— ఒక నిర్దోషిని, ఏ రుజువులూ లేకుండా మీరు శిక్షించటంలో తప్పులేదా ?

ఇవాళ మిమ్మల్ని అకారణంగా నా స్నేహితురాలు అవమానిస్తే అంతా యింత మండి పడుతున్నారే—ఆ రోజు నించీ మీ పుణ్యాన జీవచ్ఛవంలా బతుకుతున్న ఆ ప్రేమ మీ మీద యింకెంత మండి పడాలి ?''

తీక్షణంగా అడుగుతున్న సౌశీల్యకి జవాబు చెప్పలేక తల తిప్పుకున్నాడు ద్విజమౌళి.

'నిజమే ! తను ప్రేమని చేసుకోవాలని మోజు పడ్డాడు. కట్న కానుకలు కుదిరాయి. కానీ... ఆ ఉత్తరం రావటంతోనే ఏదో అనుమానం చెలరేగింది. ఆరాలు తీసినా, రుజువులు దొరకనన్న భావంతో, ఎందుకొచ్చిన తలనొప్పి లెమ్మని తను ఆ సంబంధం వదిలేశాడు !

అయితే ... ఆ విషయం తెలిసే సౌశీల్య యీ నాటకం ఆడిందా ?!'

"ఆడవాళ్లని అనుమానించటం, పీటల మీది పెళ్లిళ్లు చెడగొట్టడం మగాళ్ల హక్కులేవే ! ఆడవాళ్లకి ఆ హక్కు లేదు. అంతేనంటారా ద్విజమౌళి గారూ ?'' వ్యంగ్యంగా అడిగింది అజంత.

అప్పటికే ఓ నిశ్చయానికి వచ్చిన ద్విజమౌళి నెమ్మదిగా నవ్వాడు—"అనను, ఆ హక్కు మీకూ వుందని మీరు నిరూపించుకున్నారుగా !

మీరు నా తప్పు బాగా ఎత్తి చూపించారు. ప్రేమ నన్ను క్షమిస్తే ... నా తప్పు దిద్దుకుంటాను'' మెల్లగా అన్నాడు.

సౌశీల్య రెండడుగులు వెనక్కివేసి, ప్రేమ చేతులు రెండూ పట్టుకుని అంది — "క్షమించవే మీ ఆయన్ని! పాపం, తప్పు తెల్సిందటగా !''

పదినిమిషాల్లో బాజాలు పందిరిలో ప్రతిధ్వనిస్తూ ప్రారంభమయ్యాయి ! *